కవితా కౌముది

# దుఃఖిత తార

సుజాత పి.వి.ఎల్



మనం మమేకమై ప్రవహించిన
ఆ అమృత కాలవాహినేది?
ఒకరికోసం ఒకరమని ఏకాంతం సాక్షిగా
రాసుకున్న ఆ కావ్యమేది?
ఆకాశ వేదికపై సంధ్యలలో ఏకమయ్యే
వెలుగు చీకట్లలా పెనవేసుకున్న
ఆ బాహుబంధనాలేవి?
నా వియోగంలో ఒక్క లిప్త కాలాన్ని
ఒక్క మన్వంతరంలా అనుభూతి చెందిన
ఆ విరహవేదనేది?
కలలో, ఇలలో నన్ను తప్ప
మిగులు ప్రపంచాన్ని
నిషేధించిన ఆ కళ్ళేవి?
నన్ను నాకు మహరాణిలా
పరిచయం చేసి,
నాకై సుమ సింహాసనంగా మారిన
ఆ హృదయమేది?
నా లాలింపు కోరి నటించిన
కోపాలేవి? అబద్ధపు అలకలేవి?
అలిగిన నన్ను అలరించేందుకు చేసిన
అనిర్వచనీయమైన యుద్ధాలేవి?
నన్ను పసిపాపలా మార్చి లాలించిన
నీ బుజ్జగింపుల పూలవానలేవి?
అవన్నీ ఇప్పుడు జ్ఞాపకాలలో ఘనీభవించి
భౌతికంగా అదృశ్యమైపోయినాయి,
నేనిప్పుడు నిన్ను చేరలేని
రెక్కలు తెగిన స్వప్నాన్ని
నీ ఊహాలు సృష్టించిన
కృష్ణబిలంలో ఖైదీగా మారిన దుఃఖిత తారని.



★★★

## మట్టికోసం

## వాసుదేవమూర్తి శ్రీపతి

ఎలా నిద్ర పడుతుంది?
నన్ను రక్షించేందుకు సైన్యం
ఆయుధాలు ధరించి నా చుట్టూ
కవాతు చేస్తుంటే
ఎలా నిద్ర పడుతుంది?

ఎలా నిద్ర పడుతుంది?
నా చెమటలో కొంత
ఆయుధంగా అవతారమెత్తి
నెత్తురుతో స్నానం చెయ్యాలని
తహతహలాడుతుంటే..!

ఎలా నిద్ర పడుతుంది?
ఎక్కడ ఏ జవాను చేతిలో
మృత్యువు గర్జిస్తుందో
ఎక్కడ ఏ సైనికుడి భార్య
తన భర్త శవంపై పడి
బోరున రోదిస్తుందోననే భయంతో
మనసు వణికిపోతుంటే..!
ఎలా నిద్ర పడుతుంది?

పాడు మట్టి కోసం
ఇన్ని పాడెలు కట్టాలా..?
చెరిపేస్తే పోయే గీత కోసం
ఇన్ని ప్రాణాలు గిట్టాలా?
చుట్టూ శవాలు మొలుస్తుంటే
వాటి మధ్య నేను
పక్కేసుకుని నిద్రపోవాలా?
ఎలా నిద్ర పడుతుంది!!!

★★★

## నవచంద్రిక

## అల్లూరి గౌరీలక్ష్మి

ఆకసాన చిక్కటి చీకటి మేటలేసిన పిదప
నిరాశా మేఘాలు నిశ్చలమైన వెనక
రాత్రిళ్ళు దిగుళ్ళ రూపాలై నిలిచాక
రెండు వెలుగు కానరాని రోజులు గడిచాక
ఒక వెలుతురు విత్తనం ఊపిరి పోసుకుంటుంది

ఆ పై మరొక రోజున కొత్త ఆశారేఖ
తళుక్కుమంటుంది
అది జీవన పోరాటానికి స్ఫూర్తి వీచిక
మలిరాత్రి జనించే నవ చంద్రిక ఒక ఆదర్శ దీపిక
సృష్టి పునరపి జననపు తొలికేక
అమావాస్య నిశి దాటిన ఆత్మవిశ్వాసపు కళిక

పొటమరించిన జీవన తృష్ణకి సంకేత వాటిక
దుఃఖాన్ని పారద్రోలే జయకేతన వేడుక
అది అమావాస్య పొత్తిళ్ళ పున్నమి బాలిక
దిక్కు తోచని చిక్కు దారుల్లో మెరుపు మాలిక

అంచెలంచెల మానవ కృషి ఫలితంలా
ఆ వెలుగు రేఖ దిన దిన ప్రవర్ధమానమై
ఆశయ శిఖరం చేరిన చందమామవుతుంది
వెండి వెలుగులు పండిన పంట చేనవుతుంది

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఓ విహంగమా! వెడలిపో! ఏ వినీల
గగనతలమునకో వేగమెగిరిపొమ్ము
ఎపుడు రావలదింక నా యింటికీవు
ఏమి యుందని యాతిథ్యమీయగలను?

జీవితమ్మెల్ల నా యెదసీమ యందు
కుసుమ మందిరమున నిన్ను కొలుచుకొంటి
చేరుకొనుచుంటిని బ్రతుకు చివరి మెట్టు
ఇంక నినుకాచు శక్తి నాకేమి కలదు?

వెడలుమీ యువహృదయాల  వెదకికొమ్ము
ఆ హృదయగతిలోనాటలాడుకొమ్ము
పడుచు గుండెలలో పాట పాడుకొమ్ము
ప్రణయ మధురానుబంధమ్ము వారికిమ్ము

అలసి నిద్రించు నను మేలుకొలిపెదేల?
నిదుర లేచిన మనసుకు పదములేవి?
పదములున్నను పరువెత్తు హృదయమేది?
హృదయగీతము వెలివడ పదములేవి?

అలసి క్షణము కన్నులు మూసినంతలోన
అనుపమానందఝురిలోన మనసు మునుగు
అలసినది మేను, మనసునకలుపు లేదు
జర యెరుంగదు ప్రేమ, నిర్జరము మనసు



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS